క్లుప్తంగా

ఒడిశా బాలుడికి రూ. 45 వేల సాయం



బాలుడితో సేవా సంఘం సభ్యులు

కంచిలి: ఒడిశా రాష్ట్రం జయంతిపురం గ్రామానికి చెందిన తనీష్‌కు మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన కాళీదుర్గామాత సంఘం అండగా నిలిచింది. రఘునాథ్ , దీపుల కుమారుడు తనీష్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. శస్త్ర చికిత్స కోసం డబ్బులు అవసరమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కాళీదుర్గామాత సంఘం సభ్యులు 45 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బి.నిహార్

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బి.నిహార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన చామంతుల రామారావు సాధారణ బదిలీల్లో భాగంగా వీఆర్‌లోకి వెళ్లడంతో సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన నిహార్ విధుల్లో చేరారు. ఆయనకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత పాలిన శ్రావణిశ్రీనివాస్, పాలిన ఉమామహేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

ముగిసిన జేసీఐ వారోత్సవాలు



భోజనాన్ని స్వీకరిస్తున్న పిల్లలు

ఇచ్ఛాపురం: జూనియర్ చాంబరాఫ్ ఇండియా (జేసీఐ) స్వచ్ఛందసంస్థ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జేసీఐ అధ్యక్షుడు షణ్ముఖరావు ఆధ్వర్యంలో పట్టణంలోని బాలురు వసతి గృహంలో చిన్నారులతో కలిసి కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే కంచిలి మండలంలోని సీతయ్య ఫౌండేషన్ అనాథాశ్రమంలో పిల్లలకు భోజనం సమకూర్చారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు ఢిల్లేశ్వరరావు, స్వరూప్‌కుమార్, వెచ్చా రాము, ప్రేమ్‌సాయి, జయదేవ్, వెచ్చా సంతోష్, మోహన్ వెంకటేష్ పాల్గొన్నారు.

బైపల్లి యువకుడికి డాక్టరేట్ ప్రదానం



లెనిన్ కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన యువకుడు బొంపల్లి లెనిన్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. బయో టెక్నాలజీ రీసెర్చ్ రంగంలో విశేష సేవలు అందించినందుకు అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా భారతీయ బయోటెక్నాలజిస్ట్ లెనిన్ కుమార్‌కు ఈ అవార్డు (హనోరిస్ కాసా) అందించింది. యూసీఏ ప్రెసిడెంట్ డాక్టర్ శాంటినా డి.సాల్వో, యూనివర్సిటీ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ సంక్షేమ సంఘ సభ్యులకు లెనిన్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. .


మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఫాస్టర్ బిమ్మో బెహరా, హంగిర్ బెహరా, పౌల్ యాంగిచ్ బెహరా, జితు బెహరా, సోమేష్ బెహరా పాల్గొన్నారు.

ధనరాజుల తులసమ్మకు పూజలు



తులసమ్మ ఆలయం వద్ద భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మతల్లిని ఆదివారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఇచ్ఛాపురం మండలంతో పాటు ఒడిశా జయంతిపూర్, సుమండీ, పాత్రపురం, రొంపా, బొరడా ప్రాంతాల నుంచి అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, కోయనృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు.

• దసరా ఉత్సవాలకు శుభరాట



దసరా నవరాత్రి ఉత్సవాల కోసం ఇచ్ఛాపురం పట్టణ గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి శుభరాట వేసే ప్రక్రియను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అక్టోబర్ మూడో తేదీ నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి నవరాత్రులను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

–ఇచ్ఛాపురం

• ఆర్థికసాయం



కాశీబుగ్గలో నివాసముంటున్న వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి గ్రామానికి చెందిన సింహాద్రి సురేష్ కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఆ కుటుంబానికి వజ్రపుకొత్తూరు కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం అండగా నిలిచింది. రూ.6,500 సేకరించారు. ఈ మొత్తాన్ని సురేష్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు, ప్రతినిధులు బి.చింతామణి, కె.జగ్గారావు, ఎల్.ప్రసాద్, ఎ.సంతోష్, జె.కృష్ణారావు ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

• రోణంకి ఘనంగా నివాళి



బహుభాషా కోవిదులు ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతి వేడుకలను ఆదివారం టెక్కలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న రోణంకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం, సాహిత్య సాంస్కృతిక సమైక్య, ప్రజాచైతన్య కళాసమితి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రోణంకి అప్పలస్వామి మనవడు శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, ధనుంజయరావు, సత్తార్ రాంబాబు, ఎస్.భాస్కరరావు, ఎస్.నారాయణమూర్తి, సాహిత్య సాంస్కృతిక సమైక్య అధ్యక్షుడు బొడ్డ అయ్యాబాబు, జీవీ రెడ్డి మాస్టార్, ప్రజా చైతన్య కళాసమితికి చెందిన చిలుకు కృష్ణారావు, ఆంధ్ర స్టాలిన్, మూల తాతయ్య పాల్గొన్నారు. –టెక్కలి రూరల్

గణనాథా కాపాడయ్యా..

గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు వచ్చాయి. దీంతో తొమ్మిదో రోజైన ఆదివారం పలు గ్రామాల్లో బొజ్జగణపయ్యకు ప్రత్యేక పూజలు జరిగాయి. కొన్నిచోట్ల పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. ఇప్పటి వరకూ పూజలందుకున్న లడ్డూ ప్రసాదాలకు వేలం నిర్వహించగా భక్తులు వేలాది రూపాయలకు దక్కించుకున్నారు. అలాగే కొన్నిచోట్ల సందడి వాతావరణంలో విగ్రహాలను వాహనాల్లో తరలించి చెరువు, నదుల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



ఇచ్ఛాపురం: నిమజ్జనానికి తరలుతున్న మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు ముడియావీధి గణనాథుడు



వజ్రపుకొత్తూరు: రూ. 46 వేలు పలికి బెండి గ్రామంలోని 22 కిల్లో వినాయక లడ్డూ



కాశీబుగ్గ: వెంకటాపురంలో రూ.20 వేలకు లడ్డూను దక్కించుకున్న లోడగల ఈశ్వరరావు



కాశీబుగ్గ: హరిజనవీధిలో కుంకుమ పూజలు



కాశీబుగ్గ: గంగమ్మఒడికి వెళ్తున్న ఖైజోల గ్రామ వినాయకుడు

వంట నూనెలు కృత్రిమ కొరత!

• విక్రయాలు చేపట్టని వ్యాపారులు



కోటబొమ్మాళి: వంట నూనెల ధరలు పెరగనున్నట్లు ప్రచారం జరగడంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఉన్న స్టాకును సైతం బ్లాక్‌లోకి తరలించి.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కోటబొమ్మాళిలోని పలు షాపుల్లో ఆదివారం నూనెలను విక్రయించలేదు. అలాగే కొంతమంది ఏకంగా ఒక లీటర్ ప్యాకెట్‌కు 15 నుంచి 20 రూపాయల వరకూ పెంచి విక్రయించినట్టు వినియోగదారులు చెబుతున్నారు. చాలామంది విక్రయానికి ఆసక్తి చూపలేదు. సరుకు లేదని చెప్పి కొనుగోలుదారులను వెనక్కి పంపించేశారు. రెండు రోజుల తరువాత అధిక ధరలకు విక్రయించుకోవచ్చుననే ఆలోచనలో వ్యాపారులు ఉన్నట్టు వినియోగదారులు భావిస్తున్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

వంట నూనెలను అధిక ధరకు వ్యాపారులు విక్రయిస్తే అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కోటబొమ్మాళి సివిల్ సప్లయ్ డీటీ కె.రాము అన్నారు. పాతస్టాకును పాత ధరలకే విక్రయించాలని స్పష్టంచేసారు, సోమవారం అన్ని దుకాణాలను తనిఖీ చేసి.. స్టాకు ఉంటే చర్యలు చేపడతామని చెప్పారు.. ఇప్పటి వరకూ వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాలు రాలేదన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి: ఇంజినీరింగ్ చదువుతున్న ప్రతీ విద్యార్థి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని హైదరాబాద్‌కు చెందిన కె.ఎం.వి.ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ హరేరామ్ పెందుర్తి కోరారు. మోక్షగుండం జయంతి సందర్భంగా ఆదివారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, అధ్యాపకులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరరావు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు డీఈఈ డి.ఆశాలత, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్‌ఓడీ పి.దినకర్, డీన్ డి.విష్ణుమూర్తితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీమాస్త్రంతో సస్యరక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఐసీఆర్పీలు

కంచిలి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నీమాస్త్రం రసాయనంతో సస్యరక్షణ పొందవచ్చని ఐసీఆర్పీలు పుష్పలత, భవానీ, రోహిణి అన్నారు. అంపురం పంచాయతీ పెద్ద పాత్రపడ గ్రామంలో రైతులకు నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. రసాయం వలన కలిగే లాభాలను వివరించారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

• ఎమ్మెల్సీ రామారావు



విజేత జట్టుకు షీల్డు, నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కంచిలి: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బూరగాం గ్రామంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానాన్ని అక్కులపేట, ద్వితీయ స్థానాన్ని ఎల్.కొత్తూరు, తృతీయ స్థానాన్ని లింబుగాం టీంలు దక్కించుకొన్నారు. వీరికి షీల్డుతోపాటు రూ. 10 వేలు, రూ. 7 వేలు, రూ. 5 వేలు నగదు బహుమతులను ఎమ్మెల్సీ రామారావు చేతులమీదుగా అందజేశారు. పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. బహుమతి ప్రదానంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక నేతలు మద్దు వెంకటరావు, బొట్ట చిన్నారావు, ఉపాధ్యాయుడు మద్దు తిరుపతిరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేత కొత్తపల్లి



కొత్తపల్లి విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీవో తదితరులు

సోంపేట: పలాసపురం గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. పోటీల్లో 66 టీములు పాల్గొనగా మందస మండలం కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, హరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, మండల కేంద్రం కవిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. విజేతలకు నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలులను ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, గ్రామస్తులు బి.వెంకటకరమణ, బి,కృష్ణారావు అందజేశారు

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి



నెయిల్‌కట్టర్లను అందజేస్తున్న లయన్స్ సభ్యులు

కాశీబుగ్గ: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని లయన్స్‌క్లబ్ సభ్యులు అన్నారు. స్థానిక శ్రీసత్య సాయి స్పిరిట్యువల్ ట్రస్టు భవనములోని 92 మంది అనాథ విద్యార్థులకు నైలు కటర్స్‌ను కేపీ రామన్న సౌజన్యంతో ఆదివారం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు హెచ్‌వై దొర, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు ఉన్నారు.

కంచమ్మ తల్లికి వెండి పల్లెం బహూకరణ



వెండి పల్లాన్ని అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: భక్తుల కొంగు బంగారంగా పిలిచే కంచమ్మ తల్లికి విశాఖపట్నానికి చెందిన సుశీల్‌కుమార్ అగర్వాలా 200 గ్రాముల వెండి పల్లాన్ని బహూకరించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ఆలయ నిర్వాహకులకు వెండి పల్లాన్ని అందజేశారు.

పిచ్చిమొక్కలు తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరులో వాకర్స్ క్లబ్ వారు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పిచ్చిమొక్కలను తొలగించారు.

ప్రతి ఇంటికీ మంచినీరు



పనులను పరిశీలిస్తున్న వివేకానందరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి అన్నారు. ఈదుపురం గ్రామంలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ శుద్ధ జలం అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన అద్భుతమైన పథకంతో తాగునీరు సమస్య తీరనుందని అన్నారు. నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, ఆశి మోహనరావు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు



దోకులపాడు రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

వజ్రపుకొత్తూరు రూరల్:

మండలంలో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా సంచరిస్తు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఇప్పటికే వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, బెండి,బాతుపురం, అక్కుపల్లి, రాజాం తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి దాడులు చేయడంతో పలువురు గాయపడ్డారు. మనుషులతో పాటు మూగ జీవాలపై కూడా దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో వీధి కుక్కలను చూస్తుంటే ప్రజలు భయపడుతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఆరుబయట ఆడుతున్న పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

అడవి పందులు స్వైర విహారం



సీతాపురంలో పంటను ధ్వంసం చేసిన దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల బెండి, పెద్దబొడ్డపాడు, సీతాపురం, కొండవూరు, గల్లి, తోటపల్లి, కూర్మనాధపురం తదితర గ్రామాల్లో అడవి పందులు స్వైర విహారం చేస్తూ పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ పంటలను సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో అడవి పందులు రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాగా కొంత మంది రైతులు అడవి పందులకు బయపడి పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అడవి పందులను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తులు ఆహ్వానం

సోంపేట: శ్రీశయన చైతన్య దీపిక సోంపేట ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చాటిన శ్రీశయన విద్యార్థుల నుంచి నగదు ప్రోత్సాహకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైతన్యదీపిక ప్రతినిధులు తెలిపారు ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోగా సోంపేట ప్రధాన రహదారిలోగల సాగర్ మెడికల్ షాపు వద్ద దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అక్టోబర్ 12వ తేదీన సోంపేటలో నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90103 00860, 94939 07575 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రమాదాలను ఆహ్వానిస్తున్న మలుపులు!



జగన్నాథపురం గ్రామం వద్ద మలుపులు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు వద్ద మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. జగన్నాధపురం, ఇన్నేశుపేట, ధర్మపురం, కేశుపురం వంటి ప్రాంతాల్లోని మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోలేక ఢీకొంటూ వాహనచోదకులు గాయాల భారినపడుతున్నారు. గతంలో జగన్నాధపురం, ధర్మపురం మలుపుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన ఘటనలు స్థానికులు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

యథేచ్ఛగా కంకర తరలింపు

కోటబొమ్మాళి : కోటబొమ్మాళి పెద్దకొండ నుంచి శనివారం పట్టపగలే కొందరు ప్రైవేటు వ్యక్తులు ట్రాక్టర్లతో కంకర తరలింపు చేపట్టారు. కోటబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఉన్న రోడ్డుపైనే దర్జాగా రవాణా చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేని కంకర తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

